మీకు మోక్షం వస్తుంది అని మీకు తెలియజేస్తాడు. గురువు మీకు బయట కనబడడు, లోపల నుండి పనిచేసుకొంటూ వస్తాడు. ఒకోసారి మీకు ఆర్థిక ఇబ్బందులు వస్తాయి. ఆర్థిక ఇబ్బందుల వలన మనం నేర్చుకొనే పాఠాలు ఉంటాయి, అవి ఎప్పుడూ ఉండవు, వాటిని చూసి కంగారు పడవద్దు. మీ జీవితంలో మీకు ఇష్టమైన సంఘటన ఎదురయినా, ఇష్టంలేని సంఘటనలు ఎదురైనా అవి కొన్ని పాఠాలు నేర్పటానికే వస్తాయి. ఒకోసారి మీకు బాగా ఇష్టమైన వారు మానసికంగా దూరమవుతారు. అంటే వారి మీద మీకు ఎంత మమకారం ఉందో మీకు తెలియజేసి అప్పుడు తీసేయటం ప్రారంభిస్తాడు, వాడు గురువు. మీలో ఉన్న అజ్ఞానాన్ని మీకు తెలియజేసి, దాని వలన వచ్చే ప్రమాదాలను మీకు అర్థం అయ్యేలా చేసి గురువు వాటిని తొలగించటం ప్రారంభిస్తాడు. దాని వలన వచ్చే కష్టాలు మీకు తెలిసాయి కాబట్టి అప్పుడు మీరు కూడా సహకరిస్తారు, మీకు తొందరగా జ్ఞానం వచ్చేస్తుంది.

జీవితంలో కష్టాలు వస్తూ ఉంటాయి, నష్టాలు వస్తూ ఉంటాయి, లాభాలు వస్తూ ఉంటాయి, సుఖం వస్తూ ఉంటుంది, మీ ముఖాన్ని అటువైపుకు తిప్పవద్దు, మీ ముఖాన్ని మోక్షం వైపుకు తిప్పి ఉంచండి. మీలో చిన్న బలహీనత ఉన్నా, చిన్న వాసన ఉన్నా అది అనేక జన్మలకు కారణం అవ్వవచ్చు. అందువలన మీరు అజాగ్రత్తగా ఉండవద్దు. అన్నింటిలోను జాగ్రత్త అవసరం, సహనం అవసరం. ఈ మధ్యన ఒక ముసలాయనను చూడటానికి వెళ్ళాను. మీరు బాగున్నారా? అని అడిగాను. బాగానే ఉన్నాను, బుద్ధి వచ్చింది అని చెప్పారు. ఏమిటి? అని అడిగితే నారాయణుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, కర్మఫలదాత ఒకడు ఉన్నాడు, ఈ సృష్టిని నడిపేవాడు ఆయనే, ఆయనను కాదని మనం చేసేది ఏమీ లేదు అనేటువంటి గుర్తింపు ఇంతకాలానికి 90 ఏళ్ళు వచ్చాక కలిగింది, అందుకే బుద్ధి వచ్చింది అంటున్నాను అని చెప్పారు. మీరు చాలా అదృష్టవంతులు ఇప్పటికయినా మీకు ఆ బుద్ధి కలిగింది, సంతోషించండి, కొంతమందికి ఎంత వయసు వచ్చినా ఆ బుద్ధి కలగదు అని చెప్పాను.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 22-03-06, గుండుగొలను

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనలను రక్షించేది రామాయణం అని పెద్దలు చెపుతారు. ఆంజనేయస్వామి మనస్సు, మనలో ఉన్న బ్రహ్మమే రాముడు అని మహర్షులు చెపుతారు. ఆంజనేయస్వామి

రామచంద్రమూర్తిని ఏవిధంగా అయితే అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో అంటిపెట్టుకొని ఉన్నాడో అలాగే మన మనస్సు బ్రహ్మమును అంటిపెట్టుకొని ఉంటే మనం తరిస్తాము అంటున్నారు. వయస్సులో మనకంటే చిన్నవారు అయినా సరే ఎవరైనా మంచిమాట చెపితే మనం వినాలి అని రాముడు ఆంజనేయస్వామికి చెప్పాడు. వయస్సుకు జ్ఞానానికి సంబంధం లేదు. కొంతమందికి నూరు సంవత్సరాలు వచ్చినా శరీరం ముసలిది అవుతుంది కాని లోపల జ్ఞానం ఉండదు. ఆత్మజ్ఞానం లేకుండా ఆత్మసుఖం ఉదయించదు. ఆత్మసుఖం ఒక్కటే నిజమైన సుఖం. అదే స్వతంత్రమైన సుఖం. ఎవడైతే ఆత్మసుఖం పొందాడో వాడికి కూడా లోకం కనిపిస్తుంది కాని లోకంలో ఉన్న ఆకర్షణలకు ఆత్మానుభవం పొందినవాడు ఆకర్షింపబడడు. రావణాసురుడు లోకంచేత మోహింపబడ్డాడు ఎందుచేతనంటే రావణాసురుడులో గుణాలు ఉన్నాయి. రాముడు కూడా లోకాన్ని చూసాడు కాని లోకంచేత మోహింపబడలేదు. ఎందుచేతనంటే రాముడు గుణాతీతుడు. వేదాలలో ప్రతిపాదింపబడిన బ్రహ్మమే రాముడి రూపంలో వచ్చింది అని చెపుతారు. రామాయణంలో మనం నేర్చుకోవలసిన ముఖ్యమైన విషయం క్రమశిక్షణ. జీవితంలో మీరు ఒకటి మర్చిపోకండి. పైపై మెరుగులు చూసి దేనికి ఆకర్షింపబడవద్దు. శరీరము, ధనము, గౌరవాలు, చదువు అన్నీ కూడా మనకు బాహ్యంగా ఉన్నాయి. మనకు బాహ్యంగా ఉన్న విషయాల నుండి మనం ఏదో రోజున విడిపోవాలి. మనం కాని దానిలో నుండి మనం విడిపోవటం తప్పదు. రాముడి దగ్గర నుండి నేర్చుకోవలసింది క్రమశిక్షణ. క్రమశిక్షణ లేకుండా మీకు గౌరవం ఉంది అనుకోండి, ధనం ఉంది అనుకోండి, దాని వలన ఏమీ ప్రయోజనం లేదు. క్రమశిక్షణ లేని చదువు, అధికారం, ధనం మిమ్మల్ని పాడుచేస్తాయి కాని బాగుచేయలేవు. క్రమశిక్షణ లేకపోతే ఆ జీవుడు పతనమవుతాడు.

భక్తిమార్గం, ధ్యానమార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం ఈ మార్గాలు అన్నీ ఎందుకు అంటే మనలో ఉన్న గుణాలను తొలగించుకోవటానికే ఇవన్నీ ఏర్పాటుచేసారు. ఒక విషయం మీరు గుర్తుపెట్టుకోండి. మనం భక్తి మార్గంలో ఉన్నా, కర్మమార్గంలో ఉన్నా, అన్ని మార్గాలను సమన్వయం చేసుకొని ప్రయాణం చేస్తున్నా గుణాలు లేని స్థితిని మనం పొందాలి. మనలో గుణాలు మిగిలి ఉన్నాయి అనుకోండి ఎన్ని సాధనలు చేసినా లోకంచేత ఆకర్షింపబడతాము. మన లోపల గుణాలు ఉన్నాయి అనుకోండి, ఆ గుణాలు మనస్సును బాహ్యముఖానికి తీసుకొని

వచ్చేస్తాయి, దానికి అంతర్దృష్టి రాదు. మనస్సు బాహ్యముఖమయితే సంసారం వచ్చేస్తుంది. సత్పురుషుల సహవాసం, మహాత్ముల సహవాసం మనస్సును అంతర్ముఖం చేయటానికే. అంతఃకరణాన్ని అదుపులో పెట్టుకోకుండా నువ్వు ఆత్మానుభవాన్ని పొందలేవు. అంతఃకరణాన్ని అదుపులో పెట్టుకొనేది ఒక పని కింద కాకపోతే, ఇంక నీకు ఏది పని అంటున్నాడు పరమాత్మ. జీవితంలో నీ దేహం యొక్క ప్రారబ్ధాన్ని బట్టి నీకు చదువు వస్తుంది, ధనం వస్తుంది, అధికారం వస్తుంది, అవి ప్రారబ్ధానికి సంబంధించిన విషయాలు, అయితే వాటితో మనం ఏకం కాకూడదు. బాహ్యంగా మనకు ఉన్న విషయాలను చూసుకొని క్రమశిక్షణ విడిచిపెట్టకూడదు. క్రమశిక్షణ లేనివాడు ఇహానికి పనికిరాడు, పరానికి పనికిరాడు. మనకు నిజమైన శత్రువు మనలో ఉన్న అజ్ఞానం. అజ్ఞానంలో నుండే దుఃఖం వస్తోంది, అశాంతి వస్తోంది. అందుచేత మనం సాధన చేసి అజ్ఞానంలో నుండి విడుదల పొందాలి. అదే మన జీవిత గమ్యం. అజ్ఞానాన్ని వదిలించుకోవటం చాలా కష్టం. మీకు వేలకోట్లు డబ్బు ఉన్నా, ఆ డబ్బును ఖర్చుపెట్టి మీరు అజ్ఞానంలో నుండి విడుదల పొందలేరు. గురువు అనుగ్రహం లేకుండా మీరు అజ్ఞానంలో నుండి బయటపడలేరు.

పుణ్యాలు, పాపాలు, గౌరవాలు అగౌరవాలు, గొప్పలు తిప్పలు ఇవి అన్నీ మనస్సుకు సంబంధించిన విషయాలు. మనస్సు అనే గెడపదాటితే ఈ ద్వంద్వాలకు అసలు అర్థం లేదు. ఒక్కమాట మీరు గుర్తుపెట్టుకోండి. మన చేతిలో పది రూపాయలు ఉంటే ఎవరికైనా ఒక రూపాయి ఇవ్వగలము, మన చేతిలో పది పళ్ళు ఉంటే ఎవరికైనా ఒక పండు ఇవ్వగలము, మన పేరున పది ఎకరాలు ఉంటే ఎవరికైనా ఒక ఎకరం రాసి ఇవ్వగలము, ఇవన్నీ చేయగలము కాని మనం అజ్ఞానంలో ఉంటూ అజ్ఞానాన్ని విడిచిపెట్టలేము. కారణం ఏమిటి అంటే మన అజ్ఞానం మనకు పంచదారకంటే, తేనెకంటే తియ్యగా ఉంది, ఇంక మనం దానిని ఎలా విడిచిపెట్టగలము. గురువు యొక్క అనుగ్రహం లేకుండా మనం అజ్ఞానంలో నుండి విడుదల పొందలేము. వ్యక్తిభావనను మర్చిపోయి జీవితంలో కనీసం ఒక్క మంచి పని అయినా చేసామా అంటే చేయలేదు. అందుచేతనే మనం అజ్ఞానంలో నుండి బయటకు రాలేకపోతున్నాము. గాఢనిద్రలో మనం ఉన్నాము కాని అక్కడ రూపం గొడవ, నామం గొడవ, ఆస్థుల గొడవ ఏ గొడవ లేదు. అలా జాగ్రదవస్థలో మనం ఉండగలిగితే అజ్ఞానంలో నుండి విడుదల పొందుతాము. గాఢనిద్రలో మనకు వ్యక్తి భావన లేదు, జాగ్రదవస్థలోనికి

వచ్చేటప్పటికి వ్యక్తిభావన వస్తోంది. అక్కడ ఎందుకు లేదు, ఇక్కడ ఎందుకు వస్తోంది అని అలా విచారణ చేసి దానిని పోగొట్టుకొంటేనే హృదయంలో ఉన్న అమృతం మనకు అనుభవంలోనికి వస్తుంది.

రజోగుణాన్ని తగ్గించుకో, తమోగుణాన్ని తగ్గించుకో, సత్వగుణాన్ని పెంచుకో, అదే సాధన. సత్వగుణాన్ని పెంచుకోవాలంటే రత్నత్రయం ఉండాలి. 1. ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి, 2. ఏకాంతవాసం, 3. బ్రహ్మచింతన. మీ జేబులో మూడు రూపాయలు లేకపోయినా ఈ మూడు రత్నాలు మటుకు ఉండాలి. మీ శరీరానికి ఏ వస్తువు అయితే పడదో దానిని వదిలేయాలి. రోజూ గంటో, రెండు గంటలో ఏకాంతవాసం చేయాలి. ఏకాంతంలో ఉన్నప్పడు మన మనస్సులో ఏమి ఉందో మనకు తెలుస్తుంది. నదులకు గమ్యం సముద్రం. ఈ ఊహలకు, సాధనలకు, మాటలకు, రచనలకు గమ్యం నీ హృదయం, ఏనాటికయినా ఇవి అన్నీ వెళ్ళి హృదయంలో ఐక్యమవ్వాలి. నది వెళ్ళి సముద్రంలో ఐక్యమయ్యేవరకు దానికి రూపబుద్ధి పోదు, నామబుద్ధి పోదు. సముద్రంలో ఐక్యం అయ్యాక దానికి రూపం లేదు, నామం లేదు. అలాగే మనం హృదయంలో ఐక్యం అయినప్పడే మనకు రూపబుద్ధి నశిస్తుంది, నామబుద్ధి నశిస్తుంది. మన సాధనకు గమ్యం హృదయం. మనం తీసుకొనే ఆహారం సాత్వికంగా ఉండాలి, మితంగా ఉండాలి. ఈమధ్య ఒక భక్తురాలు నాతో చెప్పారు ఆవిడకు అనారోగ్యంగా ఉంటే డాక్టరు దగ్గరకు వెళ్ళారట. ఆవిడ మాంసం, చేపలు అవి తినరు. మీ అనారోగ్యానికి చేపలు, మాంసం అవి తినవచ్చు, మంచిది అని డాక్టరుగారు చెప్పారట. ఆవిడ డాక్టరుగారితో ఏమి చెప్పారు అంటే నేను మాంసం, చేపలు తినను. అవి తింటేనే మీకు ఈ రోగం తొందరగా తగ్గిపోతుంది అని మీరు అంటే ఈ రోగం తగ్గవలసిన అవసరం లేదు. ఈ రోగం ఏమి చేస్తుంది శరీరాన్ని చంపేస్తుంది అలాగని జంతువులను బాధపెట్టి మాంసం, చేపలు అవి నేను తినను అని చెప్పారట. కర్మసిద్ధాంతం ఏమి చెపుతుంది అంటే ఏ జంతువులను అయితే మనం తింటున్నామో ఆ జంతువులు తినటానికి మనం ఏదో రోజున వాటికి ఆహారం అవుతాము, అది చట్టం. ఆహారశుద్ధి లేకుండా, బ్రహ్మచింతన లేకుండా అజ్ఞానం నశించదు.

మనిషి పవిత్రుడు అవ్వటానికి ఉపనిషత్‌లలో రెండు మార్గాలు చెప్పారు. 1. విద్య, 2. తపస్సు. విద్య అంటే ఆత్మవిద్య. తపస్సు అంటే మనస్సును ఎండింప చేయటం. ద్వైత

భావన లేకుండా జీవించటం తపస్సు. మనం రెండు నేత్రాలను ఎంత జాగ్రత్తగా కాపాడు కొంటామో అలాగ విద్య, తపస్సు ఈ రెండింటిని కాపాడుకొంటే నువ్వు వ్యక్తిభావనలో నుండి బయటకు వస్తావు, నీకు అమృతానుభవం కలుగుతుంది. మీరు ఏదైనా దుఃఖాన్ని భరిస్తూ ఉన్నా, మీరు బాహ్యంగా ఏవైనా సుఖాలను అనుభవిస్తూ ఉన్నా అది అంతా స్వప్నమే. నాలుగు రోజులకిందట నాకు ఒక స్వప్నం వచ్చింది. నేను అన్నం తింటున్నాను. పెద్ద దుమ్ము వచ్చేసి నేను తినే అన్నంలో పడిపోయింది. స్వప్నంలో నాకు దుఃఖం వచ్చింది. అన్నం రుచిగా ఉంది, శుచిగా ఉంది, ఇప్పుడు అన్నం నేను తినటానికి పనికిరాదే అని నేను దుఃఖపడు తున్నాను. ఆ దుఃఖం ఎంత వేగంగా వచ్చింది అంటే ఆ దుఃఖం నేను భరించలేక మెలుకువ వచ్చేసింది. మెలుకువ వచ్చాక అన్నం అసత్యం, దుమ్ముపడటం అసత్యం, నేను దుఃఖపడటం అసత్యం, ఏమీ లేదే. అన్నం లేదు, దుమ్ము లేదు, ఏడుపు లేదు ఏమీ లేదు, నేను ప్రశాంతంగా ఉన్నాను. ఏమీలేని దానికి ఇంత దుఃఖం వచ్చింది ఏమిటి అని మెలుకువ రాగానే అనుకున్నాను. అలాగే మనం ఇన్ని జన్మల నుండి ఎన్ని దుఃఖాలు పడుతున్నా అమృతానుభవం కలగగానే అయ్యో ఏమీ లేదే, ఏమీ లేనిదానికి ఇంత అశాంతి తెచ్చుకొన్నాము అని మనకు అనిపిస్తుంది. రామశాస్త్రి అనే భక్తుడు భగవాన్ దగ్గరకు వచ్చి నన్ను ఎలా జీవించమంటారు అని అడిగాడు. భగవాన్ ఏమన్నారు అంటే నీ పేరు రామశాస్త్రి. రాముడు ఎలా జీవించాడో అలా జీవించు, ఇప్పుడు నీ శరీరంతో నువ్వు ఎలా ఏకంగా ఉంటున్నావో అలాగ రాముడితో ఏకంగా ఉండు. రాముడిలో ఐక్యమవుతావు, పొందవలసింది పొందుతావు అని చెప్పారు.

ఎవడు ధన్యజీవి అంటే ఇప్పుడు మనకు శరీరం వచ్చింది, మరల శరీరం తిరిగి రాకుండా ఎవడైతే చూసుకొంటాడో వాడే అదృష్టవంతుడు, వాడే ధన్యజీవి. సూర్యుడికి చీకటి ఎలా ఉంటుందో తెలియదు, లోపల ఉన్న బ్రహ్మంకు పుట్టుక ఎలా ఉంటుందో, చావు ఎలా ఉంటుందో తెలియదు. లోపల ఉన్న బ్రహ్మంకు శరీరంతో పనిలేదు, జీవుడికి శరీరం కావాలి. జీవుడిలో గుణాలు ఉంటాయి, ఆ గుణాలు వ్యక్తమవ్వటానికి శరీరం వస్తుంది, ఆ శరీరం ద్వారా గుణాలు వ్యక్తమవుతాయి. గుణాలు లేనివాడికి శరీరం రాదు ఎందుచేతనంటే శరీరం ద్వారా వ్యక్తమవ్వవలసింది అక్కడ ఏమీ లేదు. అందుచేత నువ్వు గుణాతీతుడవు అవ్వటానికి ప్రయత్నం చెయ్యి అని పరమాత్మ చెపుతున్నాడు.

మాకు దేవుడి గురించి నాలుగు మాటలు చెపుతారా అని భగవాన్‌ను అడిగారు.

దేవుడు నీకు పరాయివాడు. ఆత్మ నీ హృదయంలో ఉంది. అది నీవై ఉన్నావు. నీ హృదయంలో ఉన్న చావులేని సత్వదార్థము గురించి అడగకుండా పరాయివాడు అయిన దేవుడి గురించి అడుగుతావు ఏమిటి? నీ దేహం కూడా పరాయిదే. నీ హృదయంలో ఉన్న సత్యం తప్పించి మిగతావి అన్నీ పరాయి విషయాలే. నీ గురించి నీవు అడగటం మానివేసి పరాయి విషయాలు అడుగుతావు ఏమిటి. నీ దేహం కూడా పరాయిది కాబట్టి నిన్ను విడిచిపెట్టి బయటకుపోతుంది పుణ్యాలు, పాపాలు, గౌరవాలు, అధికారాలు ఇవి అన్నీ పరాయి విషయాలే. నువ్వు ఏదిగా ఉన్నావో దాని గురించి అడగటం వదిలేసి పరాయి విషయాలు ఎందుకు అడుగుతున్నావు. దాని గురించి అడగాలనే బుద్ధి నీకు ఎందుకు కలగటం లేదు. గురువు అనుగ్రహం లేకుండా నిన్ను నీవు తెలుసుకోవాలనే బుద్ధి నీకు కలుగదు. ఫెయిల్ అవుతామా, సక్సెస్ అవుతామా అనే మాట వదిలివేయండి, ఈశ్వరుని దయ లేకుండా అమృతానుభవం పొందాలనే తలంపు కూడా నీకు రాదు.

ప్రజలను ఉద్ధరిస్తాము అని చెప్పేవారు చాలామంది ఉన్నారు, ప్రజల కోసం అనేక మంది పనిచేస్తారు కాని వారు ప్రజల దుఃఖాన్ని ఎందుకు ఆర్పలేకపోతున్నారు అని అడుగుతున్నారు. భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే ఎవడైతే ప్రజలను ఉద్ధరిస్తాను అని అంటున్నాడో వాడే అహంకారంతో ఉన్నప్పుడు వాడు నిన్ను ఏమి ఉద్ధరిస్తాడు. కొంతమంది నాయకులు మీకు సేవ చేయవచ్చు. వారు చేసే సేవ నిజం అయినా, నిజంకాకపోయినా వారు నాయకులు అవుతున్నారు. నిజంగా మీరు బాగుపడాలని వారు సేవ చేస్తే మీకు దుఃఖం నశిస్తుంది. కాని వారు బాహ్యంగా ఏదో ఆశించి పనిచేయటం వలన వారు నాయకులు అవ్వవచ్చు కాని మీ దుఃఖాన్ని ఎలా ఆర్పగలరు, అది సాధ్యం కానేకాదు. లోపల స్వార్థం పెట్టుకొని ఓట్ల కోసం, గౌరవాల కోసం పని చేయవచ్చు, ఆ స్వార్థం వాడికి నెరవేరవచ్చు. స్వార్థాన్ని కేంద్రంగా పెట్టుకొని జీవించేవాడు మీ దుఃఖాన్ని ఆర్పలేడు. ఎవడైతే అమృతానుభవం పొందాడో, లోపల హృదయంలో ఉన్న సద్వస్తువుతో ఎవడైతే ఏకంగా ఉన్నాడో వాడు నీ అజ్ఞానాన్ని హరింపజేయగలడు, నీ అశాంతిని పోగొట్టగలడు. నా మాయను ఎవడూ జయించ లేడు అని గీతలో పరమాత్మ చెప్పాడు. మాయ ఎలా ఉంటుంది అంటే నేను చాలా మంది మంచి వారిని చూసాను. వారు కొంతకాలం నిజంగా సేవ చేస్తారు. అలా పది సంవత్సరాలు సేవ చేసిన తరువాత ఏదో పదవి లేకుండా ఉంటే ఎలాగ? ఏదో పదవి వస్తే బాగుంటుంది, పది మంది కూడా ఉంటారు

అనిపిస్తుంది, అంటే మాయ అలా అనిపింపచేస్తుంది. మాయను అతిక్రమించటం కష్టం. ఈశ్వరానుగ్రహం లేకుండా ఈ మాయలో నుండి ఎవడూ బయటకు రాలేడు.

తన యోగ క్షేమముల గురించి ఎవడైతే నిరంతరం ఆలోచించుకొంటున్నాడో వాడి మనస్సు అంతర్ముఖం అయ్యే ప్రశ్న లేదు, వాడు ఎన్ని పుణ్యకార్యక్రమాలు చేసిన వాడి మనస్సు అంతర్ముఖం అవ్వదు, ఇలా కోటిజన్మలు ఎత్తినా అజ్ఞానంలో నుండి బయటకు రాలేవు, అజ్ఞానంలో నుండి బయటకు రాకపోతే మోక్షసుఖం నీకు అందదు. మోక్షసుఖం నీ చేతికి అందాలంటే కోటి జన్మలు ఎత్తిన తరువాత అయినా నీవు అజ్ఞానంలో నుండి బయటకు రావాలి కదా అటువంటప్పుడు అజ్ఞానంలో నుండి బయటకు రావటానికి ఈ జన్మలోనే ఎందుకు ప్రయత్నం చేసుకోకూడదు. కొంతమంది సాధన చేసుకోవటానికి రేపు రేపు అంటారు, రేపుకు రూపు లేదు, ఏ రోజు పని ఆ రోజు చేసుకొంటే అసలు చెయ్యటానికి ఇంక పని మిగలదు, సాధన కూడా అంతే. చేతిలో ఉన్న పని చేసుకోవటం మానేసి రేపు రేపు అంటే యింక ఆ పని ముగియదు. ఏ రోజు చేసుకొనేది ఆ రోజు చేయాలి. ఒక ప్రక్కన వాసనాక్షయం కోసం ప్రయత్నం చేయాలి, యింకో ప్రక్కన ఆత్మవిద్యను సముపార్జించాలి. మన సాధన ఏదో మనం చేస్తున్నప్పటికీ ఈశ్వరుని దయ లేకుండా లోపల ఉన్న వస్తువును మనం పొందలేము. అందుచేత నీలోపల ఏమి జరుగుతోందో చూడటం నేర్చుకో.

ఒక ప్లీడరుగారు భగవాన్ దగ్గరకు వచ్చి లోకంలో చాలా గొడవలు ఉన్నాయి, అశాంతి ఉంది, లోకంలో మనుషులు ఎప్పుడూ సమానంగా లేరు అంటున్నారు. మనుషులు అందరూ సమానంగా ఉండరు, సమానంగా ఉండటానికి అవకాశం లేదు, అది ప్రకృతి. ఒక తండ్రికి పదిమంది పిల్లలు ఉన్నారు అనుకోండి, ఆ పదిమంది పిల్లలకు ఆస్థి సమానంగా పంచి పెట్టాడు అనుకోండి, వారు సమానంగా ఉండరు, అందులో ఒకడు బాగుపడవచ్చు, ఒకడు పాడైపోవచ్చు, దీనికి ఆ తండ్రి కర్త కాదు. ప్రపంచం అంటేనే అసత్యం. అసత్యం ఎప్పుడూ సమానంగా ఉండదు. ఇప్పుడుగాని, రాబోయే యుగాలలోకాని మనుషులను ఎవరూ సమానం చేయలేరు. లోకం అంటే కుక్కతోక లాంటిది. కుక్కతోక వంకరను ఎవడూ తీయలేడు. భగవాన్ ఏమి చెప్పారు అంటే ఈ లోకంలో గొడవలు అన్నీ ఎవరు చూస్తున్నారు అని అడిగారు. నేనే చూస్తున్నాను అన్నాడు. నువ్వు ఉంటే ఈ లోకంలో గొడవలు కనిపిస్తున్నాయా, నువ్వు లేకుండా ఇవన్నీ కనిపిస్తున్నాయా అన్నారు. నేను ఉంటేనే ఇవన్నీ

కనిపిస్తున్నాయి అన్నాడు. ఇవన్నీ చూసే ఆ నేను ఎవడో తెలుసుకోవయ్యా అప్పడు తెలుస్తుంది నీకు ఈ సృష్టి రహస్యం, అప్పటిదాకా తెలియదు అన్నారు.

ఇది మీరు బాగా గుర్తుపెట్టుకోండి. కేవలం అన్నంతినటం కోసం, బట్టలు కట్టుకోవటం కోసం మనం ఈ భూమి మీదకు రాలేదు. తినటానికి అన్నం ఉన్నవారు, కట్టుకోవటానికి బట్టలు ఉన్నవారు సుఖంగా లేరు, శాంతిగా లేరు, కేవలం దానికోసం మనం ఈ భూమి మీదకు రాలేదు. కొన్ని పాఠాలు నేర్చుకోవటానికి ఈ శరీరం భూమి మీదకు వచ్చింది. ఆ పాఠాలు నేర్చుకొనేవరకు ముక్కులో గాలి తిరుగుతుంది, తరువాత ముక్కులో గాలి ఆగిపోతుంది. ఈ శవంలోనికి గాలి ఎప్పడు వచ్చిందో మనకు తెలియదు, ఈ శవంలో నుండి గాలి ఎప్పడు బయటకు పోతుందో తెలియదు, ఈ రెండింటికి మధ్యన ఈ శవాన్ని మనం అటు ఇటు తిప్పతున్నాము. ఈ శరీరం ద్వారా మనం కొన్ని పాఠాలు నేర్చుకోవాలి. ఒకోసారి మనకు అదృష్టం ఎదురువస్తుంది, ఒకోసారి దురదృష్టం ఎదురువస్తుంది. అనేక కష్టాలు వస్తాయి, సుఖాలు వస్తాయి, లాభాలు వస్తాయి, నష్టాలు వస్తాయి. ఇవన్నీ ద్వంద్వాలు. ఈ ద్వంద్వాల మధ్యన ఉంటూ అందులోనుండి పాఠాలు నేర్చుకొని ఈ ద్వంద్వాలనుండి ఎవడైతే విడుదల పొందుతాడో వాడే జీవన్ముక్తుడు. మనకు ఏదైనా కోరిక ఉంది అనుకోండి ఆ కోరిక నెరవేర్చుకోవటానికి ఆ వేగం ముందు ఎన్ని పొరపాట్లు అయినా చేసేస్తాము. కొంత మందికి కోపం చాలా వేగంగా వస్తుంది, అప్పడు ఏమి చేస్తున్నారో వారికి తెలియదు, చేతిలో ఏదైనా ఉంటే విసిరేస్తారు. కోరిక యొక్క వేగం, కోపం యొక్క వేగం, భయం యొక్క వేగం వీటిలోనుండి విడుదల పొందేవరకు నువ్వు ద్వైతభావనలో నుండి బయటకు రాలేవు. ఆంజనేయస్వామికి మించిన సేవకుడు లేడు, ఆంజనేయస్వామికి మించిన భక్తుడు లేడు, ఆంజనేయస్వామికి మించిన పండితుడు లేడు. అసలు తనకు సొంత పని అంటూ లేకుండా దేవుడు పనే తన సొంతపనిగా చేసిన వాడు ఆంజనేయస్వామి. సేవకులలోగాని, మనం నమ్మదగినవారు అనుకున్న వారిలోకాని ఆంజనేయస్వామితో పోల్చదగినవాడు ఈ సృష్టిలో ఎవడూ లేడు. ఆంజనేయస్వామి జన్మ, ఆయన ప్రవర్తన కనీసం మనం అర్థం చేసుకొన్నా మనకున్న పనులు అన్నీ పూర్తి అయిపోతాయి, మనకు మోక్షం వస్తుంది.

భగవంతుడు ఎప్పడు ఎవరికి ఏది ఎలా ఇవ్వాలో ఆయనే చేస్తాడు, అది ఈశ్వరుడు చూసుకొంటాడు. ఈ మధ్యన ఎవరో నా దగ్గర అన్నారు ఏమండీ నాన్నగారు! భగవంతుడు

గులాబీ పువ్వంతా ఒకడికి ఇవ్వటం లేదు, అలా ఇస్తే పోనీ పువ్వుతోపాటు ముళ్ళు ఉంటాయి. గులాబీ పువ్వులో ఉన్న పువ్వులు ఒకరికి ఇస్తే, ముళ్ళు ఇంకొకరికి ఇస్తున్నాడు ఏమిటి అన్నారు. నేను ఏమి చెప్పాను అంటే పువ్వుల వలన వాడు నేర్చుకొనేది ఉంది, ముళ్ళ వలన వీడు నేర్చుకొనేది ఉంది. వాడికి పువ్వులు ఎందుకు ఇచ్చాడో మనకు తెలియదు, వీడికి ముళ్ళు ఎందుకు ఇచ్చాడో మనకు తెలియదు. కొంతమందికి జీవితం పొడుగునా కష్టాలు ఎక్కువగా ఉంటాయి. రాముడి జీవితం పొడుగునా కష్టాలే. మానవ జీవితం వచ్చాక ఎన్ని కష్టాలు వస్తాయో, ఎన్ని బాధలు వస్తాయో అన్నీ సీతారాములు మనకోసం అనుభవించి చూపించారు, అదే సీతారాముల కథ. అందుచేత భగవంతుడు చెప్పిన మాటలు వింటే మనం బాగుపడతాము, వినకపోతే పతనమవుతాము. మనం భగవంతుడి మీద గౌరవం పెంచుకోవాలి. భగవాన్ చెప్పిన ఈ సిద్ధాంతం మీరు బాగా అర్థం చేసుకోండి. నీకు గాఢ నిద్రలో అహంభావన లేదు, గాఢనిద్రలో పరిమితులు లేవు, అదృష్టం, దురదృష్టం, గౌరవం, అగౌరవం ఇవన్నీ గాఢనిద్రలో ఏమీలేవు. కాని గాఢనిద్రలో నీవు ఉన్నావు, అక్కడ నీకు దేనితోను తాదాత్మ్యం లేదు, అక్కడ సుఖంగా ఉన్నావు, శాంతిగా ఉన్నావు. గాఢనిద్రలో నీవు ఎలా ఉన్నావో, జాగ్రదవస్థలో కూడా నువ్వు అలాగ ఉండగలిగితే అప్పుడు భగవంతుడు నిన్ను ఆత్మజ్ఞానంతో అలంకరిస్తాడు, అది నీ కడసారి జన్మ.

మీ చేతిలో పనిని శ్రద్ధగా చేయండి, నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చేయండి, మీకు ఆ పని పూర్తి అయిపోయింది, చిత్తశుద్ధి కలుగుతుంది, చిత్తశుద్ధి అనే గేటు ద్వారా మీరు మోక్షంలో ప్రవేశించవచ్చు. దుఃఖ కారణాలు ఉన్నా మీరు లోపల సుఖంగా ఉండగలుగుతున్నారు అనుకోండి, అశాంతికి కారణాలు ఉన్నా మీరు లోపల శాంతిగా ఉంటున్నారు అనుకోండి మిమ్మల్ని చూసి ఈశ్వరుడు పొంగిపోయి మీలో ఉన్న అజ్ఞానాన్ని తాను తీసుకొని తన జ్ఞానాన్ని మీకు ఇస్తాడు. వాడే ఈశ్వరుడు. అప్పుడు నీకు హద్దులు లేవు, పరిమితులు లేవు. అప్పుడు నీవు ఈశ్వరుడి చేతిలో పనిముట్టు కింద ఉంటావు. అప్పుడు నీ యోగక్షేమాలను నీవు చూసుకోనక్కరలేదు, ఆయనే చూస్తాడు. ఈశ్వరుడు దయాస్వరూపుడు అంటున్నారు, ఆయన దయ నాకు ఎలా కలుగుతుంది అని రమణస్వామిని ఒకరు అడిగారు. ఈశ్వరుడి పట్ల నువ్వు శరణాగతి చెందు, ఆయన దయ నీకు కలుగుతుంది అని చెప్పారు. శరణాగతి వలన దుఃఖం నశిస్తుంది, మీ హృదయంలో ఉన్న సుఖం మీకు

స్వరూపంగా వ్యక్తమవుతుంది. మనకు ఉన్న ఆకలిని తగ్గించుకోవటానికి, మన శరీరాన్ని నిలబెట్టుకోవటానికి మనం అన్నం తింటున్నాము. ఆకలిని తగ్గించుకోవటానికి అన్నం ఎలా తింటున్నామో, రోగం తగ్గించుకోవటానికి మందులు ఎలా వేసుకొంటున్నామో, అలాగే మనలో ఉన్న గుణాలను తగ్గించుకోవటానికే భక్తి. ఈ విషయం తెలుసుకొన్నవారు ధన్యులు. మనలో ఉన్న గుణాల నుండి బయటకు రాలేము అనుకోండి, మనస్సు బాహ్యముఖానికి వెళ్ళటం మానదు, మనకు పునర్జన్మలు తప్పవు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26-03-06, పత్తేపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కర్మ చేస్తే దేహం వస్తుంది, దేహం వస్తే దుఃఖం వస్తుంది, దేహం వచ్చాక దుఃఖం లేకుండా ఎవడూ ఉండలేడు. ఈ దుఃఖం నశించటానికి పది మందులు లేవు, ఒక్కటే మందు అదే ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞానం పొందేవరకు దుఃఖం నశించదు. మన హృదయంలో ఉన్న బ్రహ్మంలో ఐక్యమయ్యేవరకు దుఃఖం నశించదు. చనిపోవటం, పుట్టటం అంటే ఏమీ లేదు ఒక బుడగలో నుండి ఇంకొక బుడగలోనికి వెళ్ళటం. శరీరం ఒక బుడగ, ఈ బుడగ పగిలిపోతుంది, ఇంకో బుడగ వస్తుంది, మరల ఆ బుడగ పగిలిపోతుంది, ఇంకొక శరీరం వస్తుంది. ఈ శరీరాలన్నీ బుడగలు. మనం ఏదైనా మాట మాట్లాడిన, చేతితో ఒక పని చేసిన ప్రేమభావనతో చేయాలి, యజ్ఞభావనతో చేయాలి. మనం యజ్ఞభావనతో పనిచేస్తూ ఉంటే మనం పవిత్రులమవుతాము. మనకు తలంపు ఉంటే వస్తుంది లేకపోతే అది రాదు అని మనం అనుకొంటాము. మన దేహప్రారబ్ధాన్ని బట్టి వచ్చేది వస్తుంది, అది మన తలంపుతో సంబంధం లేకుండానే వస్తుంది. మీరు శ్రద్ధగా ఈ ప్రవచనాలు వింటూ ఉంటే మీకు వివేకం పెరుగుతుంది, మీ కాళ్ళ మీద మీరు నిలబడ గలుగుతారు. ప్రతీ మనిషికి ఎంతోకొంత సొంతబుద్ధి ఉండాలి. మీకు సొంతబుద్ధి పెరగాలంటే జ్ఞానం తాలుక మాటలు శ్రవణం చేయాలి. మనబుద్ధిలో ఉన్న దోషాలు, పాపాలు పోవాలంటే తపస్సు చేయాలి. భగవంతుడు చెప్పిన మాటలను అనుసరించి జీవించటం తపస్సు. కొంతమంది కష్టాలు వస్తే ఎంతో సహనంగా వాటిని భరిస్తారు, అది కూడా తపస్సే.

మీరు ఎవరినీ భయపెట్టవద్దు, ఇతరులను చూసి మీరు భయపడవద్దు. మీరు